క్లుప్తంగా

మంచినీటి బోరుకు మరమ్మతు



కె.వెంకటాపురంలో చేతిబోరుకు మరమ్మతు చేస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది

కోటవురట్ల: మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ తెలిపారు. కె.వెంకటాపురంలో పాడైన ఓ చేతిబోరుకు ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది గురువారం మరమ్మతు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఏ వీధిలో కూడా మంచినీటి సమస్య రాకుండా ముందుగానే చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. పాడైన చేతిబోర్లకు వెంటనే మరమ్మతు చేయిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉంటే ముందుగా తెలపాలని సూచించారు.

భారీ వాహనాలను నియంత్రించాలి

మునగపాక : పూడిమడక రోడ్డులో భారీ వాహనాలను నియంత్రించాలని కోరుతూ గురువారం అఖిలపక్షం ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు అందించారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారికి సంబంధించి శాశ్వత పనులు జరుగుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు రాకుండా చూడాలని అఖిలపక్షం నేతలు ఆళ్ల మహేశ్వరరావు, మొల్లేటి సత్యనారాయణ, ఎం.కృష్ణ తదితరులు వినతులు అందజేశారు. ఆర్‌టీవో కార్యాలయంతో పాటు పోలీసు ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా విన్నవించారు. భారీ వాహనాలు రాకపోకల కారణంగా పూడిమడక రోడ్డు దెబ్బతిందన్నారు. ఇకపై సమస్య ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మండుతున్న ఎండలు

రాంబిల్లి : ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటలకే భానుడు భగభగలు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతున్నాయి. దీంతో రైతులు, ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండల దెబ్బకు రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మూడు రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్. వెంకటేష్ సూచించారు.

వడదెబ్బ నివారణకు ప్రత్యేక చర్యలు



వడదెబ్బ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య ప్రతినిధి రమ

రోలుగుంట: వడదెబ్బ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కోసూరి సూర్యమణి తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో గురువారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వడదెబ్బ లక్షణాలు–జాగ్రత్తలపై వీఆర్పీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కొండపాలెం, నిండుగొండ గ్రామాలకు చెందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వై.రమ, పి.లోవలక్ష్మి మాట్లాడుతూ వేసవి ఎండలకు శరీరమంతా వేడిగా ఉంటుందని, పని ప్రదేశంలోనే కళ్లు తిరిగి పడిపోవడం, దాహం వంటి లక్షణాలు కలిగి ఉంటాయన్నారు. ఆ లక్షణాలున్న వారిని గుర్తించి అక్కడ నుంచి నీడకు తరలించాలన్నారు. జనాలు గుమిగూడకుండా గాలి తగిలేలా ఉంచాలన్నారు. వారు వేసుకున్న దుస్తులు లూజు చేసి ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలన్నారు. సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

‘ఆండ్ర మృతి తీరని లోటు’

తుమ్మపాల: తెలుగు కవి, ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేసి అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆండ్ర నరసింహమూర్తి మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు వై.సత్యం అన్నారు. పట్టణంలోని గాంధీనగరంలో గురువారం నరసింహమూర్తి అకాల మరణం చెందారు. మండలంలోని శంకరం గ్రామంలో జన్మించిన ఆయన ఉపాధ్యాయుడిగా పలు స్కూళ్లలో పనిచేశారు. హెచ్‌ఎంగా మున్సిపల్ హైస్కూల్, గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించారు.
ఏపీటీఎఫ్ కార్యవర్గం ఆయన నివాసానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడిగా, హెచ్‌ఎంగా ఆయన చేసిన సేవల్ని కొనియాడారు.

కోడ్ అమలుకు పటిష్ట చర్యలు

- పాయకరావుపేట నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి గీతాంజలి



ఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించి ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయడమే లక్ష్యమని పాయకరావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గీతాంజలి తెలిపారు. గురువారం ఆమె ‘సాక్షి’తో మాట్లాడుతూ ఈనెల 16 నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. మే 13న జరిగే ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్18న నోటిఫికేషనన్ విడుదలవుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గ్రామాల్లో వివిధ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు తొలగించడం జరిగిందన్నారు. విగ్రహాలకు సైతం ముసుగులు వేయడం జరిగిందన్నారు. సభలు, సమావేశాలు, ప్రచారాలకు ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి అని, ఆన్‌లైన్‌లోనే ప్రచారాలకు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి తీసుకోవాలని తెలిపారు. అనుమతి లేకుండా నిర్వహించే సమావేశాలు, ర్యాలీలపై ఎన్నికల నిబంధనలకు లోబడి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అటువంటి కార్యక్రమాల ఖర్చును అభ్యర్థి, సంబంధిత రాజకీయ పార్టీ ఖాతాలో చూపించడం జరుగుతుందన్నారు. వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఆదేశాలు జారీ చేశామని, అలా ఎక్కడయినా పాల్గొన్న వారిని తొలగించడంతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్లపై పార్టీలకు సంబంధించిన జెండాలు, స్టిక్కర్లు ఏర్పాటు చేసినా యజమాని అనుమతితో పాటు, ఎన్నికల అధికారుల అనుమతి కూడా ఉండాలన్నారు. ప్రకటనలను ప్రదర్శించడానికి కూడా ఆర్‌వో అనుమతి ఉండాలన్నారు. అనుమతి పొందిన ప్రాంతాల్లో ప్రదర్శన బోర్డులలో ఎదుటవారికి ఎటువంటి గౌరవానికి భంగం కలిగించే విధంగా ప్రకటన ఉండరాదన్నారు. రాజకీయ పార్టీల ప్రచార వాహనాలకు దరఖాస్తుతో పాటు, వాహన రిజిస్ట్రేషన్ కార్డు, డ్రైవర్ పేరు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన యజమాని పేరు, చిరునామా ప్రూఫ్‌లు సమర్పించాలన్నారు. ప్రచారాల్లో ఎంతమంది పాల్గొంటున్నారు.. రూట్ మ్యాప్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. బహిరంగ సభ కోసం అనుమతి తప్పనిసరి అన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల పరిధి వరకు రాజకీయ ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు.

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు	2,47,508
పురుషులు	1,21,911
మహిళలు	1,25,595
ఇతరులు	2
పోలింగ్ కేంద్రాలు	292
పోలింగ్ అధికారులు	292
ఏఆర్‌వోలు	4
సెక్టర్ అధికారులు	28
రూట్ అధికారులు	28
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు	12
సమస్యాత్మక/ అత్యంత సమస్యాత్మక గ్రామాలు	52

సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

స్థానిక పోలీసు సిబ్బందితో కలసి సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించడం జరిగిందని ఆర్‌వో తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు గ్రామాల్లో పోలీసులతో కవాతు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ఆన్‌లైన్‌ను, సువిధ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోలు రూం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



చూచుకొండలోని నూకాంబిక అమ్మవారి సన్నిధిలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక: చూచుకొండ గ్రామంలో గురువారం నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు), వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్,డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ,మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్,సర్పంచ్ దొడ్డి సూరప్పారావు,ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్ కుమార్,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.

వైభవంగా పైడిమాంబ ఆలయ ప్రతిష్టాపన



పైడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



హాజరైన ఎమ్మెల్యే ధర్మశ్రీ



కోలాటం ఆడుతున్న భక్తులు

రాంబిల్లి: మామిడివాడలో గురువారం పైడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయం ప్రారంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. యలమంచిలి యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబు), ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మశ్రీ అమ్మవారి ఆలయం వద్ద రూ 50 లక్షలు ఎంపీ ల్యాడ్స్ మంజూరు చేయించారు. దీనికి తోడు దాతల విరాళాలతో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఆలయం ప్రారంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భజనలు , కోలాటాలు, అన్న సమారాధన నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, రాంబిల్లి, యలమంచిలి ఎంపీపీలు జి.శిరీషశ్రీనుబాబు, బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, గ్రామ పెద్దలు నెట్టెం సత్యనారాయణ, కరెడ్ల నాగరాజు, కన్నం రమణారావు, మోటూరు రాఘవేంద్ర పాల్గొన్నారు.

రైళ్ల హాల్టు కోసం ఏడీఆర్‌ఎంకు వినతి

- రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలించిన ఏడీఆర్‌ఎం ఎడ్విన్



అదనపు డీఆర్‌ఎం ఎడ్విన్‌కు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

యలమంచిలి రూరల్ : స్థానిక రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు సౌకర్యం కల్పించాలని కోరుతూ రైలు ప్రయాణికులు గురువారం రాత్రి దక్షిణ మధ్య రైల్వే అదనపు డీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) పీఈ ఎడ్విన్‌కు వినతిపత్రం అందజేశారు. రత్నాచల్, విశాఖపట్నం–మహబూబ్‌నగర్, బెంగుళూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు యలమంచిలి రైల్వేస్టేషన్‌లో హాల్టు సౌకర్యం కల్పించాలని ఏడీఆర్‌ఎంకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఆయన రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి ఇంకా ఏవైనా ఇబ్బందులున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ ప్రయాణికులకు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నిల్చొని ప్రయాణించే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఆయన వెంట డివిజినల్ రైల్వే ఇంజనీర్ రవి, సెక్షన్ ఇంజనీర్ రవి కిషోర్, యలమంచిలి రైల్వే స్టేషన్ ఎస్ఎస్ ఆకుల సురేష్ కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ

- పాఠశాలల్లో డైట్ అధ్యాపకురాలు మహాలక్ష్మి తనిఖీ



గొండుపాలెంలో విద్యార్థుల రికార్డులను పరిశీలిస్తున్న అధ్యాపకురాలు మహాలక్ష్మి

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని భీమిలి డైట్ కళాశాల అధ్యాపకురాలు మహాలక్ష్మి తెలిపారు. గొండుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల, దాలివలస ప్రాథమిక పాఠశాలను ఎంఈవో డీవీడీ ప్రసాద్‌తో కలిసి ఆమె గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అభ్యసన అభివృద్ధి కార్యక్రమంతోపాటు అంత్య పరీక్షల నిర్వహణను పరిశీలించారు. రక్తహీనత సమస్యను అధిగమించేందుకు భోజనం తర్వాత విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేయించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో ప్రసాద్ సూచించారు. రెండు పాఠశాలల్లో టాపర్లకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయుడు ఎల్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక పీఎస్‌ను సందర్శించిన డీఎస్పీ

మునగపాక: మునగపాక పోలీసు స్టేషన్‌ను గురువారం యలమంచిలి సర్కిల్ డీఎస్పీ భవ్యారెడ్డి సందర్శించారు.స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి తగు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.మద్యం,నగదు తరలింపులపై దృష్టి సారించాలన్నారు. వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఆమె వెంట ఎస్ఐ పి.ప్రసాదరావు ఉన్నారు.

80 లీటర్ల సారా స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, సామగ్రి

పాయకరావుపేట : మండలంలో గల గుంటపల్లి పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, 80 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. గుంటపల్లికి చెందిన గుత్తుర్తి సూర్యారావు, పెంకే వీరబాబు సారా తయారు చేస్తున్నట్టు సమాచారం అందడంతో దాడులు నిర్వహించగా, సారా బట్టీ వద్ద 80 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడు గుత్తుర్తి సూర్యారావు అదుపులోనికి తీసుకోవడం జరిగిందని సీఐ పి.అప్పలరాజు తెలిపారు. దీనితో పాటు 1000 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి, పాత్రలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడు పెంకే వీరబాబు అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని, ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రామాలయానికి రూ.15 వేల విరాళం

మాడుగుల రూరల్: తాటిపర్తిలో నూతనంగా నిర్మించిన రామాలయానికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు రూ.15 వేల విరాళాన్ని ఆలయ కమిటీకి గురువారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఓంద్రు గంగమ్మ, కృష్ణ, గొల్లవిల్లి శ్రీరామూర్తి, నాయకులు పాల్గొన్నారు.

రాజాంలో మద్యం విక్రేత అరెస్ట్

- 16 మద్యం సీసాలు స్వాధీనం

బుచ్చెయ్యపేట: రాజాంలో 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశామని ఎస్ఐ డి. ఈశ్వరరావు గురువారం తెలిపారు. గ్రామంలో తమ సిబ్బందితో గాలించగా, నిందితుడు మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

చింతలపాలెంలో ఇఫ్తార్ విందు

కోటకోట: మండలంలోని చింతలపాలెం మసీదు వద్ద గురువారం రాత్రి ముస్లింలు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం దీక్షల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కొట్టె రాము, మసీదు కమిటీ ప్రతినిధి బాబూరావు, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు షేక్ రెహమాన్, పలువురు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

తుమ్మపాల: ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, అంకితభావంతో చదివి ఉత్తమ పౌరులుగా సమాజానికి సేవలందించాలని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ అన్నారు. మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కళాశాలలో అన్ని వసతులతో విద్యా బోధన అందుతోందన్నారు. మంచి సంస్థలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి రామకృష్ణ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

- రాజకీయ పార్టీల నాయకులతో ఆర్వో కె.మనోరమ



రాజకీయపార్టీల నాయకులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మనోరమ

యలమంచిలి రూరల్ : నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు రాజకీయపార్టీలు సహకరించాలని యలమంచిలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.మనోరమ కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సాధారణ ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, ప్రవర్తనా నియమావళి అమలు, నామినేషన్ల ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్షించారు. ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంత ఉందో రాజకీయపార్టీల నుంచి కూడా అంతే సహకారం అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు మధ్య ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌గా గుర్తింపు పడిన ప్రతి కేంద్రంపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆని సదుపాయాలు, ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బందిని సన్నద్ధం చేశామన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందుగానే అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ వీడియో వ్యూయింగ్ బృందాలు నియోజకవర్గంలో పర్యటిస్తూ అభ్యర్థుల ఖర్చుపై నిఘా వేసి ఉంచుతాయన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో అనుమతులు పొందే విధానాన్ని అందుబాటులో ఉన్న యాప్‌ల గురించి వారికి వివరించారు. నామినేషన్ల స్వీకరణకు 10 రోజుల ముందు వరకు కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం–6) దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె రాజకీయపార్టీల ప్రతినిధులకు తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై అన్ని గ్రామాల్లో స్వీప్ కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అత్యంత పకడ్బందీగా చేపడుతున్నామన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



కొరుప్రోలు సచివాలయం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. ఎన్నికల కోడ్ నిర్వాహణ తనిఖీల్లో భాగంగా బుధవారం కొరుప్రోలు విచ్చేశారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వేసవి ఎండలు రోజు రోజుకి ముదురు తున్నాయని, తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే తిమ్మాపురంలో తాగునీటి సమస్య తలెత్తినట్టు సర్పంచ్ కర్రి సత్యనారాయణ తమ దృష్టికి తీసుకువచ్చారని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, సిబ్బందికి సమస్య పరిష్కరించాలని ఆదేశించామన్నారు. ఎన్నికల వేళ కనీస వసతులు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే సార్వత్రిక ఎన్నికల నియమావళి ఉన్నందున కోడ్ ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్కాడ్ తనిఖీలు జరుగుతున్నాయని వారి దృష్టికి కోడ్ ఉల్లంఘన కనిపించినా సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ఎన్నికల్లో ఘర్షణలకు దూరంగా ఉండండి

- గ్రామాల్లో పోలీసు బలగాల కవాతు



గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, ఓటర్లు సహకరించాలని నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ కోరారు. నియోజకవర్గానికి ఎన్నికల బందోబస్తు కోసం వచ్చిన కేంద్ర రక్షణ బలగాలు, సీఐఎస్ఎఫ్, ఆర్మ్‌డ్ రిజర్వ్‌ఫోర్సు సిబ్బందితో బుధ, గురువారాల్లో మండలంలో అన్ని గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో స్థానికులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు, స్థానిక ప్రజలు సహకరించాలన్నారు. పోలింగ్ సందర్భంగా ప్రలోభాలకు, హింసాత్మక సంఘటలకు పాల్పడితే కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం జరుగుతుందన్నారు. గత ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో కేసులు నమోదైన వారిని ముందుగానే గుర్తించి బైండోవర్ చేయడం, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో ఘర్షణలకు కవ్వింపు చర్యలకు దిగరాదన్నారు. ఓటు అనేది తమకు నచ్చిన వారికి వేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. దీనికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి



ఒంపోలులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గురువారం ఒంపోలులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన ప్రతీ ఒక్కరికీ మేలు జరిగిందన్నారు.సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా పేరుగాంచారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి రమణమూర్తిరాజులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు ద్వారం జానకీరామ్,పార్టీ నేతలు దొడ్డి చిన్న, నరాలశెట్టి తాతారావు, ద్వారం రామునాయుడు, రామకృష్ణ, ఈశ్వర కుమార్, ఉల్లింగల వెంకటప్పారావు , నరాలశెట్టి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

దేవరాపల్లి: బాల్య వివాహాలు చేసుకున్న వారితో పాటు ప్రోత్సహించిన వారు సైతం శిక్షార్హులవుతారని తహసీల్దార్ జి. లక్ష్మీనారాయణ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ‘బేటీ బచావో బేటీ పడావో’లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు వైద్య సిబ్బందికి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన, ఐసీడీఎస్ పీవో వి. మంగతాయారు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి డి. లోవరాజు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలను వివాహం చేసుకునే అబ్బాయితోపాటు ఇరువురి తల్లిదండ్రులు, పెద్దలపైన కేసు నమోదు చేస్తామన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేయాలని ప్రజలకు వివరించాలని సూచించారు. బాల్య వివాహాలు ఎక్కడైనా చేస్తే వెంటనే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి జి.వి.రమణ, ఏపీఎం ఎస్. ప్రభాకర్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. రాములమ్మ, వెలుగు సీసీలు, ఆశా కార్యకర్తలు, మహిళ సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.